నేటి మ్యాచ్ బెంగళూరు X హైదరాబాద్ బెంగళూరు : రా. 7.30



# ఈడెన్‌లో ఫిల్ తుఫాను

**లక్నో బౌలర్లను చితక్కొట్టిన కోల్‌కతా ఓపెనర్ • మూడు వికెట్లతో స్టార్క్ విజృంభణ • కేకేఆర్ సునాయాస విజయం**

కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) మళ్లీ విజయాల బాట పట్టింది. చెన్నైతో మ్యాచ్‌లో ఓటమి వైపు నిలిచిన కేకేఆర్.. సొంత ఇలాఖా ఈడెన్ గార్డెన్స్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై అలవోక విజయం సాధించింది. బౌలింగ్‌లో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లతో చెలరేగాడు. లక్నోలో పూరన్, రాహుల్ తప్ప మిగిలినవారంతా చేతులెత్తేశారు. మోస్తరు ఛేదనలో కేకేఆర్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ లక్నో బౌలర్లపై సుడిగాలిలా విరుచుకు పడటంతో ఈ సీజన్‌లో కేకేఆర్ నాలుగో విజయాన్ని నమోదుచేసింది. లక్నోకు ఆరు మ్యాచ్‌లలో మూడో పరాజయం.



సాల్ట్ (89*)

కోల్‌కతా: సొంత ఇలాఖా ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి మళ్లీ గెలుపుబాట పట్టింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో అలవోక విజయం సాధించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న కేకేఆర్.. ముందు బంతితో మిచెల్ స్టార్క్ (3/28), సునీల్ నరైన్ (1/17)లు కట్టడిచేయడంతో లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 161 పరుగులకే పరిమితమైంది. నికోలస్ పూరన్ (32 బంతుల్లో 45, 2 ఫోర్లు, 4 సిక్సర్లు) టాప్ స్కోరర్. ఛేదనలో కోల్‌కతా ఓపెనర్, 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 89 నాటౌట్, 14 ఫోర్లు, 3 సిక్సర్లు), శ్రేయస్ అయ్యర్ (38 బంతుల్లో 38 నాటౌట్, 6 ఫోర్లు) అండగా లక్నో బౌలర్లను చెడుగుడు ఆడుకోవడంతో ఆ జట్టు 15.4 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది.

### ఆరంభంలో రాహుల్.. ఆఖర్లో పూరన్

లక్నో ఇన్నింగ్స్‌లో తొలి రెండు బంతులను బౌండరీలుగా మలిచిన క్వింటన్ డికాక్ (10) వైభవ్ అరోరా బౌలింగ్‌లో నరైన్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆ జట్టు వికెట్ల పతనం మొదలైంది. వన్ డౌన్‌లో వచ్చిన దీపక్ హుడా (8) మరోసారి నిరాశపరచగా గత మ్యాచ్‌లో అర్ధ సెంచరీతో రాణించిన ఆయుష్ బదోని (29)తో కలిసి కెప్టెన్ రాహుల్ (27 బంతుల్లో 39, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) లక్నో స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. క్రీజులో కుదురుకుంటున్న ఈ జోడీని రస్సెల్ విడదీశాడు. రాహుల్ ఔట్ అయిన కొద్దిసేపటికే స్టోయినిస్ (10), బదోని కూడా పెవిలియన్ చేరారు. ఆఖర్లో పూరన్.. వైభవ్ అరోరా, హర్షిత్ రాణాల బౌలింగ్‌లో భారీ షాట్లు ఆడటంతో లక్నో ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.

### సాల్ట్ ధనాధన్


మోస్తరు ఛేదనను కోల్‌కతా ధాటిగానే ఆరంభించింది. తొలి మ్యాచ్ ఆడుతున్న విండీస్ బౌలింగ్ సంచలనం షెమర్ జోసెఫ్ వేసిన తొలి ఓవర్లో 22 పరుగులు దండుకుంది. ఈ ఓవర్లో ఆఖరి బంతికి షార్ట్ ఫైన్ లెగ్ వద్ద యశ్ ఠాకూర్ క్యాచ్ మిస్ చేయడంతో వచ్చిన లైఫ్‌ను సాల్ట్ రెండు చేతులా ఒడిసిపట్టాడు. మోహ్సిన్ ఖాన్ వరుస ఓవర్లలో నరైన్ (6), రఘువంశీ (7)లను ఔట్ చేసినా సాల్ట్ మాత్రం దూకుడు తగ్గించలేదు. కృనాల్ రెండో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు బాదిన అతడు యశ్ ఠాకూర్, అర్షద్ ఖాన్‌ల బౌలింగ్‌లలో బౌండరీలతో హోరెత్తించాడు. 26 బంతుల్లోనే అతడి అర్ధ సెంచరీ పూర్తయింది. అర్ధ శతకం తర్వాత అతడి దూకుడు మరింత వేగం పుంజుకుంది. మరో ఎండ్‌లో శ్రేయస్ అయ్యర్.. సాల్ట్ దూకుడుగా ఆడుతుండటంతో అతడికి అండగా నిలిచాడు. సాల్ట్ దూకుడుతో 15.4 ఓవర్లలోనే కోల్‌కతా లక్ష్యాన్ని ఛేదించింది. లక్నో బౌలర్లలో మోహ్సిన్ తప్ప అందరూ తేలిపోయారు.

**సంక్షిప్త స్కోర్లు**

లక్నో : 20 ఓవర్లలో 161/7 (పూరన్ 45, రాహుల్ 39, స్టార్క్ 3/28, నరైన్ 1/17) **కోల్‌కతా:** 15.4 ఓవర్లలో 162/2 (సాల్ట్ 89 నాటౌట్, శ్రేయస్ 38 నాటౌట్, మోహ్సిన్ 2/29)

**3** 160 పరుగులకు పైగా లక్ష్యాలను నిర్దేశించి ఓడిపోవడం లక్నోకు ఇది మూడోసారి కాగా వరుసగా రెండోసారి. గత మ్యాచ్‌లో ఢిల్లీ చేతిలో లక్నోకు పరాభవం ఎదురైంది. అంతకుముందు 13 సందర్భాల్లో లక్నో ఈ లక్ష్యాలను కాపాడుకుంది.

### విదిత్‌ను ఓడించిన గుకేశ్



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ మళ్లీ విజయాల బాట పట్టాడు. ఆరో రౌండ్‌లో ఓడిన గుకేశ్.. 8వ రౌండ్‌లో భారత్‌కే చెందిన విదిత్ గుజరాతిని ఓడించాడు. ఫ్రాన్స్ ప్లేయర్ ఫిరోజా అలీరెజాతో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. 8 రౌండ్లు ముగిసేసరికి గుకేశ్ 5 పాయింట్లతో రష్యా ఆటగాడు ఇయాన్ నెపోమియాచితో సమానంగా కొనసాగుతున్నాడు. హికారు నకమురు (4.5) ప్రజ్ఞానంద (4.5), ఫాబియానో (4) లు తదుపరి స్థానాల్లో కొనసాగుతున్నారు.

### హెచ్‌సీఏ సమ్మర్ క్యాంప్స్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: రాష్ట్రంలో ఔత్సాహిక యువ క్రికెటర్లకు వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి 9 జిల్లాలలో ఈనెల 20 నుంచి నెల రోజుల పాటు వీటిని ఉచితంగా నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. బాలురకు అండర్ – 14, 16, 19.. బాలికలకు అండర్ – 15, 19 వయో విభాగాల్లో ఈ క్యాంపులను ఉచితంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ మొదలవనుండగా ఆసక్తిగలవారు 18వ తేదీ నుంచి తమ పేర్లను నమోదుచేసుకోవాలని కోరారు. మరి న్ని వివరాలకు హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్ (http://www. hycri cket.org)ను సంప్రదించాలని సూచించారు.



**టీ20 విజేత సీఎఫ్‌సీ:** నెక్స్ట్ జెన్ ఉమెన్స్ టీ20 ట్రోఫీని సెంటర్ ఫర్ క్రికెట్ (సీఎఫ్‌సీ) ఎక్సలెన్స్ అకాడమీ జట్టు గెలుచుకుంది. ఆదివారం కోచింగ్ బియాండ్ (సీబీ) జట్టుతో ముగిసిన ఫైనల్‌లో సీఎఫ్‌సీ 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టు విజయంలో ఆల్‌రౌండర్ జి.త్రిషా కీలకపాత్ర పోషించింది. ఈ టోర్నీలో ఆమె 310 పరుగులతో పాటు 11 వికెట్లు తీసి మోస్ట్ వాల్యుబల్ ప్లేయర్ అవార్డు దక్కించుకుంది.

# చెన్నైదే ఎల్‌క్లాసికో

**రోహిత్ సెంచరీ వృథా**

**ముంబైపై సీఎస్‌కే ఘన విజయం**

**అర్ధ సెంచరీలతో రాణించిన దూబే, గైక్వాడ్**

ఐపీఎల్ అభిమానులు 'ఎల్‌క్లాసికో'గా పిలుచుకునే ముంబై– చెన్నై పోరులో భాగంగా ఈ సీజన్‌లో జరిగిన మ్యాచ్‌లో చెన్నైదే పైచేయి అయింది. ముంబైలోని వాంఖడే వేదికగా ఇరు జట్ల మధ్య ముగిసిన పోరు అభిమానులకు పైసా వసూల్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించింది. విజ యం కోసం రెండు జట్లూ హోరాహోరీ పోరాడినా చెన్నైనే విజయం వరించింది. సీఎస్‌కే తరఫున దూబే, గైక్వాడ్, ధోనీలు బాదితే ముంబైలో రోహిత్, తిలక్‌లూ బ్యాట్‌కు పనిచెప్పారు. హిట్‌మ్యాన్ ఒంటరిపోరాటం విఫలమైంది.



పతిరాన 4/28



రోహిత్ (105*)

ముంబై: ఐపీఎల్‌లో ఎన్ని మ్యాచ్‌లు జరిగినా ఈ లీగ్‌లో అత్యంత విజయవంతమైన జట్లు అయిన ముంబై ఇండియన్స్ – చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ అంటే ఎందుకంత ప్రత్యేకమో మరోసారి అభిమానుల అనుభవంలోకి వచ్చింది. ఈ సీజన్ 'ఎల్‌క్లాసికో' విజేతగా చెన్నై నిలిచింది. సీఎస్‌కే నిర్దేశించిన 207 పరుగుల భారీ ఛేదనలో రోహిత్ శర్మ (63 బంతుల్లో 105 నాటౌట్, 11 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీతో వాంఖడేను హోరెత్తించినా మిడిలార్డర్ వైఫల్యంతో ఆ జట్టుకు నిరాశే ఎదురైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మతీశ పతిరాన (4/28) అద్భుత బౌలింగ్‌తో ముంబై.. 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 186 పరుగుల వద్దే ఆగిపోయి 20 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై.. రుతురాజ్ గైక్వాడ్ (40 బంతుల్లో 69, 5 ఫోర్లు, 5 సిక్సర్లు), శివమ్ దూబే (38 బంతుల్లో 66, 10 ఫోర్లు, 2 సిక్సర్లు) దంచికొట్టడంతో నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 4 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది.

### గైక్వాడ్, దూబేల దంచుడు

24/1. తొలి 4 ఓవర్లలో చెన్నై స్కోరది. గైక్వాడ్‌ను కాదని చెన్నై రచిన్ (21)తో లోకల్ బాయ్ రహానే (5)ను పంపగా అతడు నిరాశపరిచాడు. గైక్వాడ్ రాకతో సీఎస్‌కే స్కోరు వేగం పుంజుకుంది. కొయెట్జీ ఐదో ఓవర్‌లో 4,6,4తో అతడు చెన్నై ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. రచిన్ నిష్క్రమించినా దూబేతో కలిసి ముంబై బౌలర్లను ఆటాడుకున్నాడు. హార్దిక్ వేసిన పదో ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన దూబే.. షెఫర్డ్ 14వ ఓవర్లో 6,6,4తో రెచ్చిపోయాడు. 33 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసిన గైక్వాడ్..ఔట్ అయిన శివమ్ దూబే తర్వాత అదే జోరు కొనసాగించాడు. ఆఖరి 4 బంతులున్నాయనగా క్రీజులోకి వచ్చిన ధోనీ (4 బంతుల్లో 20, 3 సిక్సర్లు) హ్యాట్రిక్ సిక్సర్లతో వాంఖడేను హోరెత్తించాడు.

### హిట్‌మ్యాన్ ధమాకా..

భారీ ఛేదనలో ముంబై కూడా బాదుడులో తక్కువేమీ తిన్లేదు. తాను ఎదుర్కొన్న తొలి 10 బంతుల్లో 12 పరుగులే చేసిన రోహిత్.. 4వ ఓవర్ నుంచి గేర్ మార్చాడు. శార్దూల్ 4వ ఓవర్లో 6, 4తో హిట్టింగ్ ఆరంభించిన అతడు.. ఆ తర్వాత ముస్తాఫిజుర్ బౌలింగ్‌లోనూ అదే రిపీట్ చేయడంతో ముంబై స్కోరు 7 ఓవర్లకే 70 పరుగులకే చేరింది. కానీ పతిరాన ముంబైకి ఒకే ఓవర్లో డబుల్ షాకులిచ్చాడు. ఇషాన్ (15 బంతుల్లో 23, 3 ఫోర్లు, 1 సిక్స్), సూర్యకుమార్ యాదవ్ (0)ను పెవిలియన్ చేర్చాడు. ఒకే ఓవర్లో రెండు వికెట్లు కోల్పోయినా తిలక్ వర్మతో కలిసి రోహిత్ ముంబై స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. కానీ పతిరాన తిలక్‌ను ఔట్ చేసి మరోసారి ముంబైని దెబ్బకొట్టాడు. ఆఖర్లో ముంబై మిడిల్ ఆర్డర్ చేతులెత్తేయడంతో ఆ జట్టు పరాభవం పాలైంది. రోహిత్ సెంచరీతో అభిమానుల బాధను కాస్త తగ్గించాడు.

**సంక్షిప్త స్కోర్లు**

చెన్నై : 20 ఓవర్లలో 206/4 (రుతురాజ్ 69, దూబే 66 నాటౌట్, హార్దిక్ 2/43, గోపాల్ 1/9), **ముంబై** : 20 ఓవర్లలో 186/6 (రోహిత్ 105 నాటౌట్ , తిలక్ 31, పతిరాన 4/28, తుషార్ 1/29)

**పాయింట్ల పట్టిక**

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 6 | 5 | 1 | 0.76 | 10 |
| కోల్‌కతా | 5 | 4 | 1 | 1.68 | 8 |
| చెన్నై | 6 | 4 | 2 | 0.72 | 8 |
| హైదరాబాద్ | 5 | 3 | 2 | 0.34 | 6 |
| లక్నో | 6 | 3 | 3 | 0.03 | 6 |
| గుజరాత్ | 6 | 3 | 3 | -0.63 | 6 |
| పంజాబ్ | 6 | 2 | 4 | -0.21 | 4 |
| ముంబై | 6 | 2 | 4 | -0.23 | 4 |
| ఢిల్లీ | 6 | 2 | 4 | -0.97 | 4 |
| బెంగళూరు | 6 | 1 | 5 | -1.12 | 2 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

## రాబడి

## ఇక ఎన్‌పీఎస్ లాగిన్ ఇలా..

**ఈ నెలారంభం నుంచి మారిన రూల్స్**




**కొత్త** ఆర్థిక సంవత్సరం (2024–25) మొదలు నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)లో మార్పులు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎన్‌పీఎస్‌లోకి లాగిన్ అయ్యే పద్ధతి మారింది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ).. ఆధార్ ఆధారిత లాగిన్ అథెంటికేషన్‌ను తీసుకొచ్చింది. ఇది యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లతో ఉంటుంది. దీని ప్రకారం..

- తొలుత ఎన్‌పీఎస్ వెబ్‌సైట్‌కు వెళ్లాలి.
- అనంతరం పర్మనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్ (పీఆర్‌ఏఎన్)/ఇంటర్నెట్ పర్సనల్ ఐడెంటిఫికేషన్ నంబర్ (ఐపీఐఎన్)తో లాగిన్ కావాలి. ఆపై పీఆర్‌ఏఎన్/ఐపీఐఎన్ టాబ్‌పై క్లిక్ చేయాలి.
- ఓ కొత్త విండో తెరుచుకుంటుంది. అక్కడ మీ ఐడీ, పాస్‌వర్డ్‌లను ఎంటర్ చేయాలి.
- ఆ తర్వాత క్యాప్చాను ఎంటర్ చేయాలి. ఆపై తెరుచుకునే విండో.. ఆధార్ ఆధారిత అంథెటికేషన్ అడుగుతుంది.
- అనంతరం మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీని ఎంటర్ చేస్తే.. మీ ఎన్‌పీఎస్ ఖాతా తెరుచుకుంటుంది.

# ఇల్లు కొంటున్నారా? గృహ రుణం కావాలా






**ప్రతీ** ఒక్కరికీ సొంతిల్లు అనేది ఓ సుందర స్వప్నం. ఈ కల సాకారానికి గృహ రుణం చక్కని మార్గం. అయితే రుణ గ్రహీత సిబిల్ స్కోర్, ఆదాయం, వేతనం, రుణ చరిత్ర ఇలా అనేకం హోమ్ లోన్ విషయంలో ప్రాధాన్యతాంశాలుగా నిలుస్తాయి. అంతేగాక వడ్డీరేట్లు, విధివిధానాలు, ప్రాసెసింగ్ ఫీజులు, ఇతరత్రా ఖర్చులు కూడా కీలకమే. మనకు తెలియని చార్జీలు (హిడెన్ చార్జెస్) ఉంటాయి. కాబట్టి గృహ రుణం కావాలనుకున్నవారు తొందరపాటుతో కాకుండా తెలివిగా వ్యవహరిస్తే లాభదాయకం.

**ఇవి గుర్తుంచుకోండి..**

- సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలపై వడ్డీ రేట్ల నిర్ణయం ఉంటుంది. స్కోర్ ఎక్కువగా ఉంటే తక్కువ వడ్డీరేటుకే లోన్ పొందవచ్చు.
- రుణం తీసుకున్న తర్వాత క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించాలి. 3 నెలలకు మించి రుణ గ్రహీత వాయిదాలు చెల్లించనట్టైతే సర్ఫేసీ చట్టం 2002 ప్రకారం కోర్టులతో పనిలేకుండా బ్యాంకులు చర్యలు తీసుకోగలవు. కాబట్టి మీ ఆర్థిక పరిస్థితి బాగా లేకుంటే మీరు రుణం తీసుకున్న సంస్థకు ఆ విషయాన్ని ముందే తెలియజేయడం మంచిది. దీనివల్ల కొంత వెసులుబాటు పొందే వీలుంటుంది.
- కో–ఓనర్‌గా మహిళలుంటే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) ద్వారా వడ్డీ రాయితీ, ఇతరత్రా సబ్సిడీలు తీసుకోవచ్చు.
- ప్రాపర్టీకి సంబంధించి అన్నీ లీగల్‌గా ఉండేలా చూసుకోవడం మంచిది. ఎన్‌వోసీలు, ట్యాక్స్ క్లియరెన్సులు తప్పనిసరి. గ్యారంటీయర్ కూడా అవసరం.
- లోన్ ఇన్సూరెన్స్ ఎంతో ముఖ్యం. మీ రుణదాతతో ఈ విషయంపై ముందే ఆరా తీసి వివరాలను కనుక్కోవాలి.
- ఆదాయ పన్ను (ఐటీ) చట్టం 1961లోని సెక్షన్ 80సీ, 24(బీ), 80ఈఈఏ కింద గృహ రుణం అసలు, వడ్డీ చెల్లింపులపై రుణ గ్రహీతలు పన్ను మినహాయింపులను పొందవచ్చు. మీ చార్టెడ్ అకౌంటెంట్ లేదా ట్యాక్స్ ప్రొఫెషనల్ సలహా తీసుకుంటే మరింత ప్రయోజనం అందుకోవచ్చు.

**బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్ సంస్థల్లో గృహ రుణాలపై వడ్డీరేట్లు ఇలా.. (శాతాల్లో)**

| సంస్థ | రూ.30 లక్షలదాకా | రూ.30-75 లక్షలు | రూ.75 లక్షలపైన |
|---|---|---|---|
| ఎస్బీఐ | 8.50-9.85 | 8.50-9.85 | 8.50-9.85 |
| బీవోబీ | 8.40-10.65 | 8.40-10.65 | 8.40-10.90 |
| పీఎన్‌బీ | 8.45-10.25 | 8.40-10.15 | 8.40-10.15 |
| కెనరా | 8.50-11.25 | 8.45-11.25 | 8.40-11.15 |
| హెచ్‌డీఎఫ్‌సీ | 9.40 నుంచి | 9.40 నుంచి | 9.40 నుంచి |
| ఐసీఐసీఐ | 8.75 నుంచి | 8.75 నుంచి | 8.75 నుంచి |
| కొటక్ | 8.70 నుంచి | 8.70 నుంచి | 8.70 నుంచి |
| యాక్సిస్ | 8.75-13.30 | 8.75-13.30 | 8.75-9.65 |
| ఎల్ఐసీ హౌజింగ్ | 8.35-10.35 | 8.35-10.55 | 8.35-10.75 |
| బజాజ్ హౌజింగ్ | 8.50 నుంచి | 8.50 నుంచి | 8.50 నుంచి |

# లాభాల స్వీకరణకు అవకాశం




**గత** వారం స్టాక్ మార్కెట్లు రికార్డులతో అదరగొట్టినా.. పడుతూ లేస్తూనే సాగాయి. కొత్త గరిష్ఠాల వద్ద మదుపరులు ఆచితూచి వ్యవహరించారు. ఫలితంగా ఈ వారం కూడా లాభాల స్వీకరణకు వీలుందన్న అభిప్రాయాలు మార్కెట్ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ సూచీల్లో అమ్మకాల ఒత్తిడి నెలకొనవచ్చని అంటున్నారు. గత వారం ట్రేడింగ్ చివరి రోజున అమెరికా ద్రవ్యోల్బణం పెరుగుదలతో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోత ఆలస్యమవుతుందన్న అంచనాలు వ్యాపించాయి. అందువల్లే సూచీలు భారీ నష్టాలనూ చవిచూశాయి. అయితే ఈ ప్రభావం ఈ వారం ట్రేడింగ్‌పైనా కనిపించవచ్చు. ఇక క్రిందటి వారం ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కేవలం 5.7 పాయింట్లే పెరిగింది. 22,519.40 పాయింట్ల వద్ద నిలిచింది. దీన్నిబట్టి ఇన్వెస్టర్లు పెట్టుబడులపట్ల ఎంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారో తెలుసుకోవచ్చు. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, వివిధ అంతర్జాతీయ పరిణామాలు కూడా ఈ వారం మార్కెట్ తీరును నిర్దేశించనున్నాయి. ఇక నిఫ్టీకి 22,400 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,000 మద్దతు స్థాయిగా చెప్పుకోవచ్చని మెజారిటీ నిపుణుల మాట. అయితే మార్కెట్ రికార్డు పరుగులు కొనసాగితే ఈ వారం 22,800–23,000 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా అంటున్నారు.

## దీర్ఘకాల డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతారా?

**డెట్** మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు అధిక రాబడులనిస్తాయి. అయితే రిస్క్ కూడా ఎక్కువ. కానీ డెట్ మ్యూచువల్ ఫండ్లు స్థిరమైన రాబడులనిస్తాయి. పైగా రిస్క్ తక్కువ. అందుకే రిస్క్‌ను ఇష్టపడని ఇన్వెస్టర్లకు ఇవి అనుకూలమని నిపుణులు చెప్తున్నారు. ఇక ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో డివిడెండ్లు, క్యాపిటల్ గెయిన్స్‌తో ఆదాయం ఉంటుంది. డెట్ మ్యూచువల్ ఫండ్లలో వడ్డీ ద్వారా మాత్రమే ఆదాయం పెరుగుతూ ఉంటుంది.

? **దీర్ఘకాల డెట్ మ్యూచువల్ ఫండ్స్ సగటు మెచ్యూరిటీ వ్యవధి ఎంత**
36 నెలలపైనే.

? **ఈ దీర్ఘకాల మ్యూచువల్ ఫండ్స్ ఎక్కడ పెట్టుబడులు పెడుతాయి**
ప్రభుత్వ బాండ్లు, కార్పొరేట్ బాండ్లు, ట్రెజరీ బిల్లులు, బ్యాంకులు జారీచేసే బాండ్లు.

? **దీర్ఘకాల ఫండ్స్ ఫీచర్లు ఏమిటి**
వడ్డీరేట్లలో మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. వడ్డీరేట్లు పడిపోతే ఫండ్ నికర ఆస్తి విలువ అనుకూలంగా, వడ్డీరేట్లు పెరిగితే ప్రతికూలంగా ప్రభావితమవుతుంది.

? **దీర్ఘకాలిక ఫండ్లకు కొన్ని ఉదాహరణలు**
ఇన్‌కమ్ ఫండ్స్, గిల్ట్ ఫండ్స్, డైనమిక్ బాండ్ ఫండ్స్.

? **ఈ దీర్ఘకాలిక డెట్ మ్యూచువల్ ఫండ్లు ఎవరికి అనుకూలం**
దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల సాధనే లక్ష్యంగా మదుపు చేసే ఇన్వెస్టర్లకు ఇవి అనుకూలం.




## టాప్-అప్ సిప్‌లతో ఈ ప్రయోజనాలు తెలుసా?

**మ్యూచువల్** ఫండ్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే మదుపరులకు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) సులువైన, అనువైన మార్గం. నెలవారీగా, త్రైమాసికాలవారీగా వీలైన పెట్టుబడులకు సిప్‌లు అవకాశం కల్పిస్తాయి. ఏకమొత్తంగా కాకుండా కొద్ది మొత్తాల్లో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఉపక్రమించవచ్చు. ఈ క్రమంలోనే టాప్-అప్ సిప్‌లూ ఇప్పుడు మార్కెట్‌లో ఫేమస్ అయిపోయాయి. అయితే ఈ టాప్–అప్ సిప్‌లలో ఉన్న ప్రయోజనాలు ఏమిటో తెలుసా?

? **టాప్–అప్ సిప్ అంటే**
నిర్ణీత కాలానుగుణంగా సిప్ అమౌంట్ దానంతటదే పెరగడానికి ఇవి దోహదం చేస్తాయి.

? **ఎలా ఉపయోగపడుతాయి**
ద్రవ్యోల్బణం దృష్టిలో పెట్టుకుని సాగే ఈ టాప్–అప్ సిప్‌లు.. కాలనుగుణంగా మీ ఆర్థిక లక్ష్యాల సాధనకు కృషి చేస్తాయి.

? **అధిక ఆదాయం–అధిక పొదుపు**
మీ ఆదాయానికి తగ్గట్టుగా పొదుపునకు ఈ టాప్–అప్ సిప్‌లు సహాయపడుతాయి. అలాగే రెగ్యులర్ ఇన్‌కమ్‌నూ పెంచుతూపోతాయి.

? **మదుపు సులభతరమవుతుందా**
కొత్త సిప్‌లు, ఒకటికి మించి ఉన్న సిప్‌ల పర్యవేక్షణలో టాప్–అప్ సిప్‌లు.. ఇన్వెస్టర్లపై ఉన్న ఒత్తిడిని తగ్గిస్తాయి.

? **ఎలా మొదలుపెట్టాలి**
సిప్‌ను ప్రారంభించేటప్పుడే టాప్–అప్ సిప్ ఆప్షన్‌ను మదుపరులు ఎంచుకోవాలి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.